# నా కోసం ఎందరో

– కోరం రాజబాబు

"నీ లోకం తప్ప మా గురించి ఆలోచించవా?" తండ్రి రామ్మూర్తిని అడిగాడు సూర్యం.

"ఇప్పుడు నేనేం చేశానురా?" తలెత్తి కొడుకు వైపు చూస్తూ అన్నాడు రామ్మూర్తి.

"ఏం చేయాలి? కనిపించిన ప్రతి వాళ్ళ దగ్గర నీ సుదీర్ఘ చరిత్ర చెబుతూ విసిగిస్తున్నావు కదా! వాళ్ళంతా ఏమనుకుంటున్నారో నీకేమన్నా తెలుసా?

"ఏమనుకుంటున్నారు సూర్యం?"

"ఏమీ తెలియనట్టు మాట్లాడతావేం? ఆ ముసలాయన చాదస్తం భరించలేకపోతున్నామంటున్నారు. మీ ఇంటి దరిదాపులకి రావాలంటే భయంగా వుందిరా సూర్యం! అంటూ పారిపోతున్నారు. ఉన్నదేదో తిని కూర్చోకుండా మమ్మల్నెందుకు ఇలా హింసిస్తావ్!"

"నేను మిమ్మల్ని హింసిస్తున్నానా?"

"నువ్వు చేస్తున్న వెధవ పని వల్ల మాకు హింస కాక మరేమిటి?"

"ఒరేయ్ సూర్యం! కొంచెం గౌరవంగా మాట్లాడరా!"


"ఏం నాన్నా! నీకు అరవై ఏళ్ళు దాటాయి. ఇప్పుడు కూడా నీకు గౌరవం కావాలి. ఈ వీధిలో మాకు మాత్రం గౌరవం అక్కరలేదా! మేం తలెత్తుకుని తిరగనవసరం లేదా?"

"నా ప్రవర్తనలో తప్పు వుందంటావా సూర్యం?"

"ఆ విషయం నువ్వే ఆలోచించుకో. టీచర్‌గా రిటైరైన వాడివి. లోకజ్ఞానం నాకన్నా నీకెక్కువ తెలుసు. దయచేసి మమ్మల్ని ఇబ్బంది పెట్టకు." నాలుగు రోజులుగా తండ్రిని అడగాలనుకుంటున్న మాటలు అడిగేసి, కడిగేసి వెళ్ళిపోయాడు సూర్యం

రామ్మూర్తికి ఒక్కసారిగా ఊపిరాగినంత పనైంది. వృద్ధాప్యాన్ని ఆనందంగా గడపాలనుకోవడం తప్పా? ఎన్ని సార్లు ప్రశ్నించుకున్నా సమాధానం దొరకలేదతనికి. ఉపాధ్యాయునిగా వున్నప్పుడు ప్రతి మాటా పాఠమైతే ఇప్పుడు మాట్లాడేది చాదస్తమంటాడేమిటి వీడు! జీవితంలో ఎదురు దెబ్బలు, అనుభవాలు ఇతరులతో పంచుకోవాలనుకున్నది కేవలం మనశ్శాంతి కోసం అని అనుకున్నాడే తప్ప తనో సమస్యంగా మారిపోతాడనుకోలేదు. భార్య చనిపోయాక తప్పనిసరి పరిస్థితిలో కొడుకు దగ్గరికి వచ్చాడు రామ్మూర్తి. ఇప్పుడు కొడుక్కి భారంగా వుంటూ ఇతరులకు సమస్యగా మారడం అంటే ఏమిటో అర్థం కావడం లేదాయనకు.

తన గదిలో పడుకున్నాడే గాని నిద్ర రావడం లేదు. పక్కనే మనవడు, మనవరాలు వున్నారు. వాళ్ళంటే పంచప్రాణాలు తనకు. అప్పుడప్పుడు ఆ పసివాళ్ళలా మారిపోతే ఎంత బావుంటుంది?



అనుకునేవాడు చాలాసార్లు. వృద్ధాప్యాన్ని భరించడం తప్ప మరో మార్గం లేదని తెలిసి మనసునన్నా పసి పిల్లల స్థాయిలో మార్చుకోవాలని ఆశపడ్డాడు. అందుకే వాళ్ళలా అల్లరి పనులు చేయడం, ఇతరుల్తో ఎక్కువగా మాట్లాడడం కావాలనే చేశాడు తప్ప చాదస్తం వల్ల కాదు. పొద్దున్నే కొడుకన్న మాటలు జ్ఞాపకానికొచ్చి అతని గుండె కలుక్కుమంది. ఒక్కసారి ఎక్కడో చిన్న బాధ. అది గుండెనంతా ఆక్రమించుకునే సరికి లోతుకు పోయిన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. భార్య చనిపోయినప్పుడు ఏడ్చాడతను. అప్పుడు వూరు వూరంతా ఓదార్చింది. మరిప్పుడు? తనొక్కడే! తనకెవరూ లేరు.

సడలిన అవయవాలు సహకరించనప్పుడు రాజీ తప్ప మరో మార్గం లేదు. అయితే మనసుకెవరు సర్ది చెబుతారు? తనకు తానే చెప్పుకోవాలి. ఘర్షణ మొదలైందతనిలో. ఉపాధ్యాయునిగా నేర్చుకున్న వివేకం ఆలోచనల్లోకి నెట్టేసిందతన్ని.

లేచి హాల్లోకి వచ్చాడు. ఇరుకైన హాలు. ఫ్యాన్ వేస్తే ఒప్పుకోరు. కొడుకు, కోడలు వాళ్ళ గదిలో నిద్రపోతున్నారని తెలిసినా ఫ్యాన్ వేయలేకపోయాడు. అది అతనిలో వున్న గొప్ప సంస్కారం. తిరిగి తన గదిలోకి వెడుతున్నప్పుడు హఠాత్తుగా ఏవో గుసగుసలు వినిపించాయతనికి. తన గురించే అని తెలిసేసరికి ముందుకేస్తున్న అడుగులు ఒక్కసారిగా ఆగిపోయాయి. వినడం సభ్యత కాదని తెలుసతనికి. అయినా తన గురించే అని తెలిసిన

తర్వాత వినాలనిపించడం తప్పుకాదనిపించింది.

"మీ నాన్న గారితో సమస్యలు రోజు రోజుకీ ఎక్కువవుతున్నాయి. మీకే చెప్తేది!" కొంచెం స్వరం పెంచింది కోడలు.

"నువ్వు రోజూ చెబుతున్న విషయాలే కదా! ఉదయాన్నే ఆయన్ని మందలించాను కూడా.." సూర్యం గొంతులో విసుగు!

"మీరేదో అన్నంత మాత్రాన ఆయన ప్రవర్తనలో మార్పు వస్తుందనుకుంటున్నారా? ఆయన చేసే పనులు చికాకు పుట్టిస్తున్నాయి. అంతా చాదస్తమే. నేను భరించలేక పోతున్నాను. మరో విషయం ఆడవాళ్ళు కనిపిస్తే తినేసేలా చూస్తాడు. నాకు ఎదురింటి పిన్ని గారు చెప్పారు. ఆయనెదురైతే చాలు భయం వేస్తోందట! ఇక వయసులో వున్న ఆడపిల్లల విషయంలో వెర్రి చేష్టలు, వేళాకోళం. ఇవన్నీ చూస్తూ, వింటూ ఎలా బ్రతకగలం! మీరే ఏదో నిర్ణయం తీసుకోవాలి!"

"ఏం నిర్ణయం తీసుకోవాలి? అసలు మనసులో ఏదో దాస్తున్నావ్. అదేదో స్పష్టంగా చెప్పొచ్చు కదా!"

"ఏముంది ఇంట్లో మీరు లేనప్పుడు నాకు భయం వేస్తోంది. ఆయన చూపుల్లో ఆవేశం చూస్తుంటే నాకు చిర్రెత్తుకొస్తోంది. ఛ! అదేం బుద్ధో! మనిషిలో కొంచెమయినా సభ్యత వుండాలి కదా! అయినా..ఇన్నాళ్ళూ ఆయన సంపాదించుకున్నది ఏం చేశాడో చెప్పమనండి. పెన్షన్ డబ్బులన్నీ కూతుళ్ళకు పంపిస్తాడు. మీరు నాలుగు డబ్బులు సంపాదిస్తున్నంత మాత్రాన మనకేమీ అక్కరలేదా? మన దగ్గరెందుకు? కూతుళ్ళ దగ్గరకే వెళ్ళమంటే సరి!"

"నువ్వెందుకు ఆవేశపడతావ్. నేనాయనకు చెప్పాల్సింది చెప్తాను. కొద్ది రోజులు చూద్దాం. అప్పటికీ ఆయనలో మార్పు రాకపోతే అప్పుడు నువ్వు చెప్పినట్టే చేద్దాం".

"సరే మీ ఇష్టం!"

ఇద్దరి మాటలు ఆగిపోయాయి. రామ్మూర్తి తన గదిలోకి వచ్చి పక్క మీద వాలిపోయాడు. తనేం తప్పు చేశాడని. అసలెందుకింత చర్చ? ఆవేశం వచ్చిందతనిలో. అయినా ఏమీ చేయలేని నిస్సహాయత. అసహనం – అవమానం గుండెల్ని మండిస్తుంటే కన్నీళ్ళతో ఓదార్చుకున్నాడు. జీవితం నేర్పిన అనుభవంలో తొందరగానే నిర్ణయం తీసుకున్నాడు. అప్పుడు కునుకుపట్టిందతనికి.

*** ***

తెల్లారింది. తండ్రి కనిపించకపోయేసరికి సూర్యం కంగారు పడ్డాడు.

"మీకెందుకు ఆ కంగారు! ఆయనేమన్నా చిన్న పిల్లాడా తప్పి పోవడానికి! రాత్రి మన మాటలు విని వుంటాడు. అభిమానం చంపుకోలేక ఎటన్నా వెళ్ళిపోయాడేమో...మీరు అనవసరంగా కంగారు పడకండి!" తనకేమీ పట్టనట్టు ఎంతో తేలిగ్గా భార్య చెప్పిన మాటలు సూర్యానికి చికాకు పుట్టించాయి. కన్న తండ్రిని బయటకు గెంటివేశారన్న అపవాదు వస్తుందని భయపడుతున్నాడే గాని, నిజానికి తండ్రి ఇల్లు వదిలి వెళ్ళిపోయినందుకు కాదు. లోలోపల సమస్య తీరిందన్న ఆనందంతో పాటు ఆందోళన ఇద్దరికీ వుంది. అందుకే కాసేపు చర్చించుకున్నారు. తర్వాత మర్చిపోయారు. రోజులు గడిచిపోయాయి. రామ్మూర్తి జాడ మాత్రం తెలియలేదు. పైగా రామ్మూర్తి ఏమయ్యాడన్న ఆలోచన, బెంగ వాళ్ళకు లేవు. దాదాపు తండ్రిని మర్చిపోయాడు సూర్యం. కొన్ని బంధాలు ఎంతో బలంగా వుంటే మరికొన్ని తాత్కాలికంగా వుంటాయి. ప్రతి మనిషి తన వూపిరి తను పీల్చగలిగినప్పుడు ఇతరుల ఫీలింగ్స్, వేదలతో కూడిన అరుపులు ఎందుకు వినలేడు? అర్థమయినట్టనిపించినా ఎప్పటికీ అర్థంకాని ప్రశ్న అది.

*** ***

మరికొన్ని రోజులు గడిచిపోయాయి. ఒకరోజు సూర్యం పేరుతో ఒక ఉత్తరం వచ్చింది. ఆత్రంగా లెటర్ విప్పాడతను.

సూర్యం...

నా గురించి దాదాపు మర్చిపోయి వుంటారు. అవునా? నవ్వేమీ ఉలిక్కిపడకు. నేననుకుంటున్నదే నిజం. నేనెందుకు ఇల్లు విడిచిపెట్టానో నీకు తెలుసు. అయితే నీకు తెలియంది మాత్రం ఒకటుంది. నేను నా కోడల్ని కన్న కూతురుగానే చూశాను తప్ప మీరనుకుంటున్నట్టు మరో ఉద్దేశం నాకు లేదు. అంత నీచుణ్ణి కాను. పసివాళ్ళకు విలువల్ని బోధించిన ఉపాధ్యాయుడ్ని. ఏదో ఒంటరితనాన్ని మర్చిపోవడానికి, వృద్ధాప్యాన్ని ఆనందంగా గడపడానికి నా మనసును అలా మలచుకున్నానే తప్ప నీతి తప్పిన వాడ్ని మాత్రం కాదు.

ఇప్పుడు నేనెక్కడున్నానని నువ్వు ఆలోచిస్తూ వుండొచ్చు. నీకెప్పటికీ తెలియని చోట నేను ప్రశాంతంగా వున్నాను. నేనెంత మాట్లాడినా, ఎంత విసిగించినా కోపగించుకునే వాళ్ళెవ్వరూ లేరిక్కడ. అనుభవాల్ని పంచుకోవడానికి, శేష జీవితాన్ని హాయిగా గడపడానికి ఒకరికొకరం తోడుగా వున్నాం. అందరూ నాలాంటి వాళ్ళేగా. మాకు హద్దులెక్కడ వున్నాయి చెప్పు? నిజం చెప్పాలంటే మేమంతా చిన్నపిల్లలం. ఒకవేళ నేను చనిపోయినా నువ్వు రాకూడదనే నేను ఎక్కడున్నదీ చెప్పలేదు. నేను కన్ను మూస్తే ఎన్నో జతల కళ్ళు వర్షిస్తాయి. మా మధ్య అంత అనుబంధం వుందిలే.

నీకు మరో విషయం చెప్పాలి. నా పెన్షన్ కూతుళ్ళకి ఎందుకిస్తున్నానో తెలుసా? నిన్ను చదివించడానికి, నువ్వు వ్యాపారం పెట్టుకుంటానంటే దానికి నేను చాలా డబ్బు ఖర్చు పెట్టాను. అమాయకులైన నీ చెల్లెళ్ళకు నేనేమీ ఇవ్వలేదు రా! అందుకే...నా పెన్షన్ నీకు రాదు. నీ దగ్గర వున్న రోజుల్లో కడుపు నిండా అన్నం పెట్టావ్. ఆ విధంగా ఈ తండ్రి ఋణం తీర్చేది చివర్లో ఒకటుంది. అది చనిపోయినప్పుడు. కానీ నీకా అవకాశం నేను ఇవ్వడం లేదు. నిజానికి ఆ ఆలోచనే నాకు లేదు. నాకోసం ఇక్కడ చాలామంది వున్నారు. వాళ్ళందరి కోసం నేనున్నాను. ఈ తృప్తి చాలు. ఇంకొక విషయం! ఇక్కడున్న వాళ్ళంతా నీలాంటి కొడుకును కన్నవాళ్ళే. శక్తి లేక, జవసత్వాలుడిగి, గమ్యంలేని ఎన్నో జీవితాలకు ఇక్కడ అమ్మ ఒడి చల్లదనం అంత కాకపోయినా ఆదరించి మనసుకు తగిలిన గాయాలను మాన్పించే మరో మాతృమూర్తి ఒడిలో మేమున్నాము. ఇక్కడ చావును కూడా ఆనందంగానే స్వీకరిస్తాము. కోడలికి నా కృతజ్ఞతలు చెప్పు. నీ పిల్లల్ని మాత్రం ఓ తండ్రికి మంచి బిడ్డల్లా పెంచు. నేనలా చేయలేకపోయినందుకు సిగ్గుపడుతున్నాను. సెలవ్!!

–రామ్మూర్తి.

తండ్రి రాసిన ఉత్తరం చదివే సరికి సూర్యం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వేదనతో గొంతు పూడుకుపోయింది. తనేం తప్పు చేశాడో అర్థమయ్యేసరికి అతని హృదయం కదిలిపోయింది. తండ్రి రాసిన లెటర్‌లో నల్లని అక్షరాలు వెక్కిరిస్తుంటే నిల్చున్న చోటే కూలబడిపోయాడు.

అప్పుడే అటు వైపు వచ్చిన సూర్యం భార్య ఆందోళనగా అతని దగ్గరకు వచ్చి.."ఏమైంది మీకు? ఎందుకిలా అయ్యారు "? అంటూ భర్తను పట్టుకుంది.

"ఏముంది. నీ అభీష్టం నెరవేరిందిగా! దయచేసి నన్ను మౌనంగా వుండనీ ప్లీజ్!!"

"ఎందుకిలా మాట్లాడుతున్నారు? ఏమిటీ నిందలు? విషయం చెప్పొచ్చుగా!"

"వినేటంత విశాల హృదయం నీకుందా? లేనిపోనివి కల్పించి నన్ను తప్పుదారి పట్టించావ్. ఓ మహానుభావుడికి ద్రోహం చేసేలా ప్రోత్సహించావ్. ఎవరా వ్యక్తి అని అడగకు. ఎందుకంటే ఆ వ్యక్తి నీకు తెలుసు. కాని... నువ్వెప్పుడూ వ్యక్తిని అర్థం చేసుకోలేవు. ఆ వ్యక్తిత్వాన్ని నేనిక చూడలేను. నన్నిలా వుండనీయ్!" భారంగా.. బాధగా కళ్ళు మూసుకున్నాడు సూర్యం.